క్లుప్తంగా

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

చీరాల: చైతన్య భారతి ఆధ్వర్యంలో శనివారం నుంచి 22వ తేదీ వరకు సంగీత సద్గురు త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలు ముంతావారి సెంటర్‌లోని ఎస్‌వీఎస్‌అండ్‌ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలోని పైభాగంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణమూర్తిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు రాత్రి వివిధ ప్రాంతాల్లోని సంగీత విద్వాంసులచే గాత్ర కచ్చేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు అందరూ విచ్చేసి కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

జే.పంగులూరు: మండల పరిధిలోని స్థానిక పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ కే స్వరూపారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై ప్రజా సమస్యలు పరిష్కార మార్గం చూపించాలని కోరారు.

నేడు ఇంకొల్లు బస్టాండులో స్వచ్ఛాంద్ర కార్యక్రమం



బస్టాండు ఆవరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఇంకొల్లు (చినగంజాం): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంకొల్లు బస్టాండు ఆవరణలో శనివారం స్వచ్ఛాంద్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీ శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని సంబంధిత అధికారులు, సిబ్బంది కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు. అదే విధంగా సబ్సిడీ రుణాల కోసం ఈ నెల 20వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లోనే చూసుకోవాలని ఆయన తెలిపారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి



చినగంజాం: మండలంలోని కొత్తపాలెం మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు కుక్కల నాగ మల్లేశ్వరరెడ్డి శుక్రవారం మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం ఇంటిలోని బాత్‌రూంలో జారిపడిన ఆయన తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పరిస్థితి విషమించింది. అనంతరం వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం దక్కలేదు. మృతుడికి భార్య ఉన్నారు.

ప్రయాణికులకు అందుబాటులో మరుగుదొడ్లు



ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేనున్నట్లు చీరాల ఆర్టీసీ డీఎం జంజనం శ్యామల తెలిపారు. ఆర్టీసీ ప్రాంగణంలో 1993లో నిర్మాణం చేసిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి ప్రయాణికులకు అసౌకర్యంగా మారిందని, ఇందుకు మౌళిక సౌకర్యాలు కల్పించే కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లను ఆధునికీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇందుకోసం రూ. 4 లక్షల నిధులను మంజూరు చేసి పనులను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

సినిమా హాల్లో కొట్లాట


అద్దంకి రూరల్: సినిమా హాల్లో యువకుల మధ్య కొట్లాట జరగ్గా ఒక యువకుడికి గాయలైన సంఘటన శుక్రవారం రాత్రి అద్దంకిలో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు హాలు వద్దకు వెళ్లి యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఎస్సై ఖాదర్‌బాషా వివరాల మేరకు.. అద్దంకిలోని సత్యనారాయణ కామందిర్‌లో డాకు మహారాజ్ సినిమా చూసేందుకు మండలంలోని వెంపరాల, కొండలరాయునిపాలెం గ్రామాలకు చెందిన యువకులు వచ్చారు. థియేటర్‌లో సిబ్బంది టికెట్లు తనిఖీ చేసే సమయంలో యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఒక యువకుడి గాయాలయ్యాయి.

సచివాలయాల్లో స్వచ్ఛ దివస్

అద్దంకి రూరల్: మండలంలోని అన్ని సచివాలయాల్లో శనివారం స్వచ్ఛతా దివస్ కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో సింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని శింగరకొండపాలెం గ్రామంలో నిర్వహించే కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటీ సీఈవో బాలమ్మ పాల్గొంటారని తెలిపారు. అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంద్ర దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 10.30 గంటలకు అద్దంకి మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ, ప్రతిజ్ఞ ఉంటుందని పేర్కొన్నారు.

'కల కానిది విలువైనది.. బతుకు కన్నీటిధారలలోనే బలిచేయకు. కలతలకే లొంగిపోయి కలువరించనేలా..' అన్న శ్రీశ్రీ పాటను ఒకసారి వింటే చాలు. మళ్లీ జీవించాలనే ఆశ కలుగుతుంది. సృష్టిలో నోరు లేని మూగ జీవాలు, పశుపక్ష్యాదులు ఆత్మహత్యలు చేసుకుంటాయా.. చేసుకోవు. మరి మనకే ఎందుకు?. మారుతున్న కాలానుగుణంగా, కొత్తకొత్త పోకడలతో యువత అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. చిన్నదైన సమస్యకు ఎంతో విలువైన ప్రాణాలను పణంగా పెడుతున్నారు యువత. ఈమధ్య కాలంలో చీరాల నియోజకవర్గంలో ఈతరహా ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

- వేటపాలెం



బతికి పోరాడు.. నిలిచి గెలువు

- క్షణికావేశాలతో బలవన్మరణాలు
- రెండు నెలల్లో పదుల పైనే ఆత్మహత్యలు
- చిన్నచిన్న సమస్యలకే కుంగుబాటుకు లోనవుతున్న వైనం
- 20 నుంచి 50 ఏళ్ల లోపువారే అధికం
- కుటుంబ సభ్యులకు తీరని శోకం

మచ్చుకు కొన్ని ఘటనలు..

➤ 2024 డిసెంబరు 25వ తేదీన వేటపాలెం పాకనాటి వీదిలో అద్దె కుంటూ 36 ఏళ్ల వ్యక్తి భార్య మరణించగా ఒక్కడే ఉంటున్నాడు. భార్య మణాన్ని తట్టుకోలేక ఆరు నెలలకే ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకొని మృతి చెందాడు.

➤ కొత్తపాలేనికి చెందిన 32 ఏళ్ల ఓ యువకుడు 2024 నెలలో ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటి నుంచి వెళ్లిన మరుసటి రోజు తెల్లవారు జామున ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

➤ 2024 డిసెంబరులో దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురానికి చెందిన 25 ఏళ్ల యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవాడు. ఇతనికి పెళ్లి అయింది. పెళ్లి అయిన రెండేళ్లకే భార్య పుట్టింటికి వెళ్లింది. దీనితో మానసింగా కుంగిపోయాడు. రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న యువకుడు తెల్లవారి లేచి చూసేసరికి ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు.

➤ 2024 నవంబరులో రామన్నపేట వినాయకపురం కాలనీకి చెందిన 28 యువకుడు మద్యానికి బానిసై ఇట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి భార్య, ఒక కొడుకు ఉన్నాడు. దీంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది.

➤ 2024 నవంబరులో ఆణుమల్లిపేటకు చెందిన 36 ఏళ్ల వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో కుంగిపోయి రైలు కింద పడి అర్ధంతరంగా తనువు చాలించాడు. పాల్పడ్డాడు. ఇది జరిగిన రెండు రోజులకే ఇతని తాలూకు 30 ఏళ్ల మహిళ రామన్నపేట దగ్గరలో రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడింది.

ఇలా చేస్తే రక్షించవచ్చు..

ఆత్మహత్య భావనలో ఉన్న వారిని ఒంటరిగా ఉంచరాదు. వీలైనంత వరకు ఇంట్లో వారందరి మధ్య ఉంచి కుటుంబ సభ్యులంతా వారిలో ధైర్యం నింపాలి. వీలైనంత వరకు ఆత్మహత్య భావన ఉన్నవారిని ఆత్మహత్యకు సహకరించే వస్తువులను అందుబాటులో లేకండా చూడాలి. ఆత్మవిశ్వాసం, జీవితంపై ఆశను పెంచే పుస్తకాలు, ప్రవర్తన చికిత్స, కౌన్సెలింగ్ ప్రక్రియలు శక్తివంతంగా ఉపయోగపడుతాయి. వీలైతే మానసిక వైద్య నిపుణులచే కౌన్సెలింగ్ ఇప్పించాలి.

చట్టం ఏం చెప్తోంది.

ఆత్మహత్యకు పాల్పడడం, యత్నించడం, అందుకు ప్రోత్సహించడం చట్టప్రకారం నేరం. ఆత్మహత్యకు ప్రయత్నించిన వారిపై భారతన్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 226 కింద, ఆత్మహత్యకు ప్రోత్సహించే వారిపై సెక్షన్ 108 కింద కేసు నమోదు చేస్తారు.

క్షణికావేశంలోనే అంతా..

ప్రాణం విలువైందని గ్రహించే లోపే క్షణికావేశంలో కొందరు యువకులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. 2024 డిసెంబర్‌లోనే దాదాపు పది మంది మరణించారు. కుటుంబ సమస్యలనో, ఆర్థిక ఇబ్బందులనో, అప్పుల బాధ తా లేకనో, అనారోగ్యమనో, పరీక్షల్లో తప్పామనో, ప్రేమ విఫలమైందనో ఇలా రకరకాల కారణాలతో అతిగా ఆలోచించి బలవతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇలాంటివి రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. మానసికంగా కుమిలిపోతున్న వారిని కుటుంబ సభ్యులు సకాలంలో గుర్తించక పోవడం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, ప్రధానంగా విద్యార్థులు, యువతపై తమ అభిప్రాయాలను తల్లిదండ్రులు బలవతంగా రుద్దడం కూడా ఆత్మహత్యలకు కారణమవుతోందని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అతిగా ఆలోచించకూడదు..



సాంకేతిక యుగంలో మనిషి మారుతున్న విధానాలతో ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నాడు. సమస్యలు ఎవరికీ చెప్పుకోలేక ఎవరికి వారే కుమిలిపోతున్నారు. అతిగా ఆలోచించకుండా మనోధైర్యాన్ని కోల్పోకుండా ఇతరులతో పంచుకొని సమస్యను పరిష్కరించుకోవాలి. సమస్యలను కుటుంబ సభ్యులు, మిత్రులతో చర్చించాలి. లేకపోతే మానసిక వైద్యులను సంప్రదించాలి. విపరీత నిర్ణయాలు తీసుకుంటే మనపైన ఆధారపడిన వారి జీవితం ఏమవుతుందో ఆలోచించాలి.

- డాక్టర్ కేవీఎస్ రామానుజం, వేటపాలెం

ప్రశాంతంగా బతకడం అలవర్చుకోవాలి..



మానవ జీవతం అంటే ఒడిదుడుకులు ఉంటాయి. కష్టసుఖాలను సమపాళ్లలో తీసుకోవాలి. దేనికి బెదరకూడదు, కుంగిపోకూడదు. సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కోవడానికి ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా మహిళలు ఇంట్లో సమస్యలను తలకెక్కించుకోకూడు. తేలిగ్గా తీసుకుని బతకడం నేర్చుకోవాలి. సమస్యలుంటే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోకూడు. ప్రతి సమస్యకు చావే పరిష్కారం కాదు.

- మల్లికార్జునరావు, రూరల్ సీఐ, చీరాల

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేటపాలెం: 33-11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశాయిపేట, వేటపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి

చీరాల టౌన్: వలసలను నిర్మూలించి కూలీలు అందరికి ఉపాధి కల్పించాలని ఎంపీడీవో శివసుబ్రమణ్యం సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల్లో సచివాలయాల అడ్మిన్లు, డిజిటల్ అసిస్టెంట్లతో కలిసి ఉపాధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల నుంచి ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా చర్యలు తీసుకుని ప్రతి కూలీకి జాబ్‌కార్డు అందించి ఉపాధి పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో విధిగా పనులను గుర్తించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో కలిసి అన్నీ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన ప్రతి పనిని రికార్డు చేసి పనుల సంఖ్యలు పెంచాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో దాసు, ఫీల్డు అసిస్టెంట్లు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పరికరాల కోసం దరఖాస్తు

బల్లికురవ: మండలంలోని దివ్యాంగులకు ఆలింకో సంస్థ సహకారంతో ఎలక్ట్రికల్ చార్జింగ్ ట్రైసైకిళ్లు, కర్రలు, వినికిడి మిషన్లు, వీల్‌చైర్లు మొదలగు ఉపకరణలు అందిస్తున్నారని మండల దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు దమ్ము అంజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు ప్రకారం 60 సంవతసరాలు నించి వినికిడి లోపం ఉన్న వృద్ధులకు మిషన్‌లు అందజేస్తారని, అర్హులు ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌లు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మండల దివ్యాంగుల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉపకరణాలు అందిస్తారనారు. వివరాలకు 90102 98154 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

హెల్మెట్ పెట్టుకో.. ప్రాణాలను రక్షించుకో



ఈపురుపాలెంలో హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై చంద్రశేఖర్



మేదరమెట్లలో పొగాకు కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మహ్మద్ రఫీ

చీరాల టౌన్: వాహనాలు నడిపే వారు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్లు, కార్లు నడిపే వారు సీట్ బెల్టులు విధిగా ధరించాలని ఈపురుపాలెం ఎస్సై అంబటి చంద్రశేఖర్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ఈపురుపాలెం-బాపట్ల ప్రధాన రహదారిలో ప్రయాణిస్తున్న ప్రయాణికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించి వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపకూడదన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్లు ధరించే వాహనాలు నడపాలని, కార్లు, ఇతర వాహనాలు నడిపే వారు సీట్ బెల్టు ధరించే వాహనాలు నడపాలన్నారు. నిర్ణీత వేగం కన్నా అధిక వేగంతో వాహనాలు నడపవద్దని ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద కుటుంబ సభ్యులు ఎదురు చూస్తుంటారని సగటు వేగంతోనే వాహనాలు నడపాలన్నారు. అతివేగంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ప్రతి ఒక్కరు నియమాలు పాటించాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో ప్రయాణికులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మేదరమెట్ల: వాహనాల్లో ప్రయాణించేసమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని మేదరమెట్ల ఎస్ఐ మహ్మద్ రఫీ సూచించారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో పొగాకు బ్యారన్‌ల వద్ద ఉన్న కూలీలకు ఆయన వాహనాల్లో ప్రయాణంపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఆటోల్లో ప్రయాణించే సమయంలో పరిమితికి మించి కూలీలు ఎక్కరాదని, అలా ప్రయాణిస్తే ఎప్పుడైనా ప్రమాదాలు జరగవచ్చన్నారు. అలాంటి వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేద్దాం



వెంకటేష్‌ను కలిసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు అన్నారు. శుక్రవారం రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీలో జిల్లా, నియోజకవర్గ స్థాయిలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రభుత్వంలో అన్ని వర్గాల మేలు జరిగిందన్నారు. జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు వాసిమళ్ల వాసు, పార్టీ పట్టణ అధ్యక్షులు యాతం మేరిబాబు, చీరాల రూరల్ అధ్యక్షులు అద్దంకిరెడ్డి, వేటపాలెం మండలం అధ్యక్షులు ఉమ్మిటి శివరామకృష్ణ, పార్టీ నాయకులు గవిని శ్రీనివాసరావు, యాతం సునీల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిశారు.

పంట నమోదుతో రైతులకు నష్టపరిహారం



దైవాలరావూరులో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు



బొల్లవరప్పాడులో శనగలో సమస్యలపై వివరిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు



ధేనువకొండలో మాట్లాడుతన్న ఏడీఏ ధన్‌రాజ్

అద్దంకి: ఈ-క్రాప్ నమోదుతో రైతులకు వివిధ ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏడీఏ ధన్‌రాజ్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం మండలంలోని ధేనువకొండ, గోపాలపురం గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతు సాగు చేసిన ప్రతి పంట తాలూకు సమాచారం ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయాలని కోరారు. దీని వలన రైతు భరోసా, పంటల నష్టపరిహారం వంటి పథకాలు అందుతాయని చెప్పారు. మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణ అయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి తగు సూచనలు సలహాలు అదజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, రైతులు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల: రబీలో సాగు చేపట్టిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలిన ఏవో శ్రీనివాసరావు సూచించారు. కొరిశపాడు మండలంలోని బొల్లవరప్పాడు, దైవాలరావూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు శనగలో వచ్చే ఆకుమచ్చ, కుంకుమ తెగులుపై అవి రాకుండా తీసువాల్సిన చర్యల గురించి వివరించారు.

శనగలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి..

ఇంకొల్లు (చినగంజాం): శనగ పండించిన రైతులు పంటలో వచ్చే తెగుళ్ల నివారణపై అప్రమత్తంగా ఉండాలని పర్చూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్ మోహనరావు సూచించారు. మండలంలోని పూసపాడు, హనుమోజీపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. శనగ పచ్చపురుగు నివారణకు ఎకరాకు 200 మి.లీ ఇండాక్సికార్బ్ లేదా 60 మి.లీ రైనాక్సిఫైడ్ పిచికారీ చేయాలని తెలిపారు. కుంకుమ తెగులు(తుప్పు) నివారణకు హెక్సాకోనజోల్ 400 మి.లీ లేదా ప్రోఫికోనజోల్ 200 మి.లీ పిచికారీ చేసుకోవాలని తెలియజేశారు. రబీ పంటకు సంబంధించి ఈ పంట నమోదు చేసుకోవాలని ఏవో వేణుగోపాల్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చురుకుగా ఆలయ నిర్మాణ పనులు



నిర్మాణ పనుల్లో వీర్ల అంకాలమ్మతల్లి ఆలయం

బల్లికురవ: పలనాటి వీర్ల అంకాలమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయి. మండలంలోని గుంటుపల్లి, పల్నాడు జిల్లా కాకుమానులో సుమారు 40 కుటుంబాల పూసుకురివారు ఉన్నారు. గ్రామంలోని చిన్న రామాలయం సమీపంలో శతాబ్దాల క్రితం తమ పూర్వీకులు అంకాలమ్మ తల్లిచిన్న ఆలయంతో ఆరాధించారని చెప్పారు. అప్పటి ఆలయం జీర్ణావస్థతో పడిపోయిందని అదే చోట తిరిగి ఆలయం నిర్మించేందుకు సమాయత్తమైనట్లు కుటుంబ సభ్యులు సాక్షికి తెలిపారు. తమ కుటుంబాలతో పాటు గ్రామస్తుల సహకారం సుమారు రూ.25 లక్షల అంచనాలతో నిర్మాణ పనులు సంవత్సరం క్రితం చేపట్టినట్లు తెలిపారు. పలనాటి వీర్ల అంకాలమ్మ ఆలయాన్ని పూర్తి హంగులతో ప్రతిష్ఠ మహోత్సవాలకు సిద్ధం చేస్తామని నిర్వాహకులు చెప్పారు. పల్నాడు జిల్లా కారంపూడిలో మాత్రమే ఈ ఆలయం ఉందని. ఇక్కడ నిర్మాణ పనులు, ప్రతిష్ఠ మహోత్సవాలు పూర్తయితే. బాపట్ల జిల్లాలో ఇదే ఏకైక ఆలయం అని వివరించారు.

వ్యాక్సినేషన్ తప్పక అందించాలి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో నివశిస్తున్న ప్రజలతో పాటుగా 0-5 ఏళ్లలోపు చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను విధిగా రికార్డుల్లో నమోదు చేయడంతో పాటుగా టీకాలను సక్రమంగా అందించాలని ఈపురుపాలెం పీహెచ్‌సీ సీహెచ్‌వో రూతమ్మ సూచించారు. శుక్రవారం ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్య స్థితిగతులు, శిశు మరణాల తగ్గింపుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, 5 ఏళ్లలోపు చిన్నారులకు అందించాల్సిన రోగాల నిర్మూలన టీకాలు, రోగనిరోధకశక్తి పెంచే ఇంజక్షన్లను క్రమం తప్పకుండా అందించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వివరాల గణాంకాలను వారం రోజుల్లో అందించాలని సూచించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, పుష్యమాసం పుబ్బ నక్షత్రం, పంచమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరినకోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

జాతీయ రహదారిపై ఇళ్ల తొలగింపు



విస్తరణలో భాగంగా తొలగించిన కట్టడాలు

జే.పంగులూరు: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 2011లో నష్టపరిహారం చెల్లించి సేకరించిన స్థలాల్లో ఉన్న కట్టడాలను శుక్రవారం నుంచి తొలగిస్తున్నట్లు, పంగులూరు మండల తహశీల్దార్ పీ సింగారావు, హైవే సైట్ ఇంజినీర్ హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేని కారణంగా వర్షపు నీరు, మురుగు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. నివాస గృహాల మధ్య మురుగు నీరు చేరుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇందుకు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.